సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 5 । మార్చి । 2023



శ్రీవారికి వెండి వస్తువులు


రాయవరం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయానికి బొడ్డు కాశీవిశ్వనాథం, రమేష్, సబ్బిశెట్టి రాజరాజేశ్వరి శనివారం వెండి సామగ్రిని ఆలయ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డికి అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి యర్రా సన్యాసినాయుడు, వంశీ వినోద్ కుమార్ (జగన్నాథపురం) శనివారం రూ.1,11,116 విరాళాన్ని ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు అందజేశారు.

డెల్టాలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,740 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,370, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

స్వామివార్లను దర్శించిన జస్టిస్ జ్యోతిర్మయి



జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు బాలబాలాజీ స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు/అయినవిల్లి: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వార్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకట జ్యోతిర్మయి దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి అప్పనపల్లిలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వదించారు. రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలరాణి, జూనియర్ సివిల్ జడ్జి డి.సురేష్‌బాబు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి స్వామి వారి చిత్రపటాలను, ప్రసాదాలను ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు అందజేశారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను ఆలయ చైర్మన్ అందజేశారు. ఆలయ విశిష్టతను ప్రధానార్చకుడు వివరించారు.


బాలాబాలాజీ సన్నిధిలో భక్తుల సందడి



బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల కోలాహలం నెలకొంది. పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.25 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.59,502 చొప్పున విరాళాలు వచ్చాయి. స్వామి వారిని 2,589 మంది దర్శించుకున్నారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2,036 మంది స్వీకరించారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



హెచ్‌ఎంకు విరాళం ఇస్తున్న విజయలక్ష్మి

సఖినేటిపల్లి: మోరి గ్రామంలోని జాన సుబ్బమ్మ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి జగ్గన్నపేటకు చెందిన కాశిన విజయలక్ష్మి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని హెచ్‌ఎం మద్దాలి వెంకటేశ్వరరావుకు శనివారం అందించారు. స్వగ్రామం మోరిలోని ఉన్నత పాఠశాల లైబ్రరీలో తన తల్లిదండ్రులు జాన బాబూరావు, ఇందిరాదేవి జ్ఞాపకార్థం రేకు వేసే పనులకు ఈ విరాళాన్ని ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మడ అడవుల సౌందర్యం

మడ.. ప్రకృతి అందాల జాడ

- మైమరపించే మాంగ్రూవ్స్
- తీరానికి రక్షణ.. పర్యాటక ఆకర్షణ

సండే స్పెషల్

సాక్షి, అమలాపురం: తూర్పు కనుమల మధ్య.. ఒంపు సొంపులతో ప్రవహించే గోదావరి అందచందాలు చూడాలంటే పాపికొండల విహార యాత్రకు వెళ్లాల్సిందే. అంతకు మించిన మధురానుభూతి పొందాలంటే మాత్రం జిల్లాలోని మడ అడవులను వీక్షించాల్సిందే. కోనసీమ అంటే పచ్చని వరి చేలు.. కొబ్బరి తోటలు.. సముద్ర తీరాలే కాదు.. మడ అడవులు సైతం ఈ సీమ అందానికి కొత్త వన్నెలు అద్దుతున్నాయి. వీటిని ఇంగ్లిషులో మాంగ్రూవ్స్ అంటారు. సముద్ర తీరానికి ఇవి సహజ రక్షణ కవచంగా ఉన్నాయి. జిల్లాల విభజన తరువాత కోనసీమలోని ఐ.పోలవరం మండలం మండలం భైరవపాలెం నుంచి అంతర్వేది సముద్ర సంగమ ప్రాంతం వరకూ మాత్రమే మడ అడవులు పరిమితమయ్యాయి. జిల్లాలో వీటి విస్తీర్ణం 6,500 హెక్టార్లు. గౌతమి, వృద్ధ గౌతమి, వైనతేయ, వశిష్ఠ నదీపాయలు సముద్రంలో కలిసే ప్రాంతాలను ఆనుకునే కాకుండా కూనవరం, వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్‌ను ఆనుకుని కూడా మడ అడవులు విస్తారంగా ఉన్నాయి. కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల తీర గ్రామాల్లో సహజసిద్ధంగా ఏర్పడిన మడ అడవులు ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరు.

అరుదైన వృక్ష, జంతు జాతులు

- మడ అడవుల్లో నల్లమడ, తెల్లమడ, ఉప్పుపొన్న, కలింగ, తాండ్ర, గుల్లిలం, తిల్లా, పొన్న తదితర వృక్షజాతులతో పాటు చిల్లంగి, కళ్లతీగ, పెనంగి, దబ్బగడ్డ వంటి మూలికల మొక్కలు ఉన్నాయి.
- మొసళ్లు, ఫిషింగ్ క్యాట్స్, నీటి కుక్కలు, డాల్ఫిన్స్ వంటి జంతు జాతులు, 120 రకాల పక్షులు, కీటకాలు కూడా ఇక్కడ జీవిస్తున్నాయి.
- మడ అడవుల సందర్శన ద్వారా జీవ వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం దక్కుతుంది. విజ్ఞానం, వినోదం ఒకేచోట పొందడానికి ఇది ఉపయోగపడుతుంది.
- సముద్ర తీరాన్ని ఆనుకుని ఐదు నుంచి పది అడుగుల ఎత్తు మాత్రమే పెరిగే ఈ మడ అడవుల్లో పెద్ద చెట్లు చూడటం చాలా అరుదు.

ప్రకృతి అందాలకు స్వర్గధామం

మడ అడవులు ప్రకృతి అందాలకు స్వర్గధామంలా ఉంటాయి. పాము మెలికలు తిరిగినట్టు ఉండే నదీపాయల్లో సాగే పడవ ప్రయాణాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు. ఆసక్తికరమైన జీవన వైవిధ్యం ఈ ప్రాంతంలో కనిపిస్తుంది. దట్టంగా కనిపించే అరుదైన వృక్ష జాతులు.. వాటి చెట్ల వేళ్లు నీటి మీద తేలియాడే దృశ్యాలు ముచ్చటగొలుపుతాయి. పడవ మీద ప్రయాణిస్తుంటే నీటికాకులు, మడ కొంగల వంటి పక్షులు.. మడ చెట్ల మీద కనిపించే పీతలు, తాబేళ్లు, పాములు.. అరుదైన జంతువులు కళ్ల ముందు మెరిసి, మాయమ వుతుంటాయి. దారిలో ఎదురయ్యే తెరచాప పడవలు.. ప్రయాణికుల బోట్లు.. మత్స్యకారుల వేటకు వాడే నాటు పడవలు, దోనెలు.. ఇలా ఇక్కడ కనిపించే ప్రతి అంశం దృశ్యకావ్యంలా మనోఫలకంపై నిక్షిప్తమవుతుంది.

మగసానితిప్ప ప్రయాణం మధురానుభూతి

గోదావరి నదీపాయల మధ్య ఉండే మగసానితిప్పను ప్రకృతి ప్రేమికులు, అన్వేషకులు ఒకసారి తప్పకుండా సందర్శించాల్సిందే. గంట నుంచి గంటన్నర పాటు జరిగే ఈ ప్రయాణంలో మడ అడవుల అందాలన్నింటినీ ఒకేసారి చూసే అదృష్టం దక్కుతుంది. ఐ.పోలవరం మండలం జి.మూలపొలం, కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామాల నుంచి ఇక్కడకు పడవ మీద వెళ్లే అవకాశముంది. ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల సరిహద్దుల్లోని వాసాలతిప్ప, నక్కా రామేశ్వరం ఉప్పుటేరుల మధ్య విస్తరించిన మడ అడవుల అందాలు సైతం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. ఇక్కడ పర్యాటక శాఖ బోటింగ్ ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

కందికుప్ప
ఎకో టూరిజానికి ప్రతిపాదనలు



గతంలో కాట్రేనికోన మండలం కందికుప్ప వద్ద ఫారెస్టు గెస్ట్‌హౌస్ ఉండేది. ఇక్కడ బోటింగ్ కూడా జరిగేది. తొలుత దీనిని పునరుద్ధరించాలని భావిస్తున్నాం. కందికుప్ప గెస్ట్‌హౌస్ నుంచి రాతి కాలువ, సముద్ర మొగల వరకూ బోటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాం.

- ఎంవీ ప్రసాదరావు, జిల్లా అటవీ అధికారి



మడ అడవుల చెంతన ఉన్న మగసానితిప్పకు ప్రయాణికులను తీసుకు వెళుతున్న బోటు



ఫిషింగ్ క్యాట్

విద్యార్థులపై నిర్లక్ష్యం చూపితే చర్యలు

- డీఈఓ కమలకుమారి హెచ్చరిక
- అంబాజీపేట జెడ్పీ హైస్కూలు సందర్శన



హైస్కూల్‌లో విచారణ చేస్తున్న డీఈఓ కమలకుమారి

అంబాజీపేట: పాఠశాలల్లో విద్యార్థులపై ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి హెచ్చరించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు శుక్రవారం అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై శనివారం ఆమె హైస్కూల్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీఈటీ గర్భిణి కావడంతో మెటర్నటీ సెలవుపై వెళ్తున్నారని, ఈ నేపథ్యంలో ఖేలో ఇండియా ఈవెంట్ పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో పొందు పరిచేందుకు విద్యార్థినులతో పీఈటీ ఎండలో రన్నింగ్ చేయించారని చెప్పారు. ఇది దురదృష్టకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో విద్యార్థినులు కోలుకున్నారని, వారికి రెండు రోజులు పూర్తి విశ్రాంతి ఇచ్చామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఎక్కువ సమయం ఎండలో తిరగకుండా ఉపాధ్యాయులు నియంత్రించాలని డీఈఓ సూచించారు.

టెన్త్ పరీక్షలకు 20,967 మంది విద్యార్థులు

వచ్చే నెల 3 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 374 హైస్కూళ్ల నుంచి 20,967 మంది విద్యార్థులు హాజరు కానున్నారని డీఈఓ కమలకుమారి తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 19,084 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 1,883 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి బాలురు 10,868 మంది, బాలికలు 10,099 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి బాలురు 1,062, బాలికలు 821 మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని డీఈఓ సూచించారు.

పంట భూములకు అదనపు జలాలు

- తూర్పు, మధ్య డెల్టాలకు నీటి విడుదల పెంపు
- అదనంగా మరో 215 క్యూసెక్కులు

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా పంట కాలువలకు అధికారులు నీటి విడుదలను పెంచారు. రబీ సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తూర్పు, మధ్య డెల్టాలకు ఇప్పుడిస్తున్న దానికన్నా అదనంగా 215 క్యూసెక్కుల నీటిని పెంచారు. ఇదే సమయంలో పశ్చిమ డెల్టాకు 230 క్యూసెక్కులు తగ్గించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కుల చొప్పున మొత్తం 7,540 క్యూసెక్కుల నీటిని శుక్రవారం నుంచి విడిచిపెడుతున్నారు. అంతకు ముందు తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,425, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున ఇచ్చేవారు. బ్యారేజీ వద్ద శనివారం ఉదయం ఇన్‌ఫ్లో 7,164 క్యూసెక్కులు కాగా, ఇందులో సీలేరు నుంచి 6,361 క్యూసెక్కులు వస్తోంది. పాండ్ లెవెల్ 12.83 మీటర్లకు చేరింది.



తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువ

'రంగరాయ'కు 48 కొత్త పీజీ సీట్లు



- రాష్ట్రంలోనే తొలిగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఏర్పాటు
- ఇప్పటి వరకూ సీట్లే లేని మరో రెండు డిపార్ట్‌మెంట్లకు 9 మంజూరు

కాకినాడ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం చొరవతో రాష్ట్రంలో మరే వైద్య కళాశాలకూ దక్కని అరుదైన ప్రాధాన్యం కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీకి దక్కింది. తాజాగా జరిగిన ఇన్‌స్పెక్షన్‌లో కళాశాల స్థాయిని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) గుర్తించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం సిఫారసు మేరకు నూతన విభాగాల ఏర్పాటుకు పూర్తి స్థాయి అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిరకాలం నుంచి ఖాళీగా ఉన్న సైకియాట్రీ, రేడియోథెరపీ డిపార్ట్‌మెంట్లలో 9 పీజీ సీట్లకు అనుమతి ఇచ్చింది. అలాగే నూతన డిపార్ట్‌మెంట్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌కు కూడా అనుమతి ఇస్తూ 5 పీజీ సీట్లు కేటాయించింది. కళాశాలను ఫిబ్రవరి 1న ఎన్‌ఎంసీ సందర్శించింది. బోధకుల సంఖ్య, బోధన సమర్థత, వారి అనుభవం, విద్యనభ్యసించేందుకు అందుబాటులో ఉన్న, కొత్తగా ఏర్పాటైన, అభివృద్ధి చెందుతున్న మౌలిక వసతులు, బోధనలో అనుసరిస్తున్న విధానాలు, ఇతర అంశాలను పరిగణిస్తూ ఇచ్చిన ఎసెస్సర్ నివేదిక ఆధారంగా.. మెడికల్ ఎసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (ఎంఏఆర్‌బీ) తాజాగా పీజీ సీట్ల కేటాయింపు, పెంపుదలకు అనుమతిచ్చింది. రంగరాయ వైద్య కళాశాల చరిత్రలో ఈ స్థాయిలో పీజీ సీట్లు పెరగడం ఇదే తొలిసారి కావడంతో వైద్య వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. నిర్ణీత 15 విభాగాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం వినతితో ఎన్‌ఎస్‌సీ పరిశీలనకు సిద్ధమైంది. వాటిలో 12 డిపార్టుమెంట్లలో ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసి, 48 సీట్లు కేటాయించింది. మరో మూడు డిపార్టుమెంట్లలో త్వరలోనే ఇన్‌స్పెక్షన్ పూర్తి కానుంది. అనంతరం అదనంగా మరిన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది.

రంగరాయ వైద్య కళాశాలలో ఇప్పటికే 150 పీజీ సీట్లు ఉండగా.. తాజా కేటాయింపులతో అవి 198కి చేరాయి.

డిపార్టుమెంట్	ప్రస్తుత పీజీ సీట్లు	కొత్తగా కేటాయించినవి	మొత్తం
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్	0	5	5
సైకియాట్రీ	0	4	4
రేడియోథెరపీ	0	5	5
పేథాలజీ	6	8	14
మైక్రోబయాలజీ	6	4	10
ఫోరెన్సిక్ మెడిసిన్	3	2	5
ఆర్థోపెడిక్	5	8	13
ఈఎన్‌టీ	6	2	8
ఆప్తాల్మాలజీ	9	4	13
రేడియో డయాగ్నోసిస్	4	3	7
న్యూరో సర్జరీ	2	4	6

నూకాంబిక అమ్మవారికి రూ.13.66 లక్షల ఆదాయం



ఆలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

ఆలమూరు: చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో వివిధ సేవలు, వ్యాపారాల నిర్వహణకు శనివారం నిర్వహించిన వేలం పాటల్లో రూ.13.66 లక్షల ఆదాయం లభించింది. ఆలయ ముఖ మంటపంలో రామచంద్రపురం ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు ఆధ్వర్యాన దేవదాయ తనిఖీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్ ప్రసాద్ పర్యవేక్షణలో ఈఓ ఉండవల్లి వీర్రాజు ఈ వేలం పాటలు నిర్వహించారు. పసుపు, కుంకుమల విక్రయానికి రూ.38 వేలు, కోళ్లు , కొబ్బరి, అరటి పండ్ల సేకరణకు రూ.3.25 లక్షలు, వారకల్లు పోసే హక్కుకు రూ.3.51 లక్షలు, తుళ్లబిళ్లకు రూ.2.50 లక్షలు, చీరలు, రవికల సేకరణకు రూ.4.02 లక్షల చొప్పున ఆదాయం లభించిందని ఈఓ వివరించారు. గత ఏడాది రూ.11.10 లక్షలు రాగా, ఈ ఏడాది అదనంగా రూ.2.56 లక్షలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్గని కరుణ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం



విగ్రహం ఏర్పాటుకు చెక్కు అందిస్తున్న రాజశేఖర్

మలికిపురం: రామరాజులంకలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ చొప్పల రాజశేఖర్ శనివారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు గ్రామ విగ్రహ ఏర్పాటు కమిటీకి చెక్కు అందించారు.

గ్రంథాలయాలకు 3 వేల పుస్తకాల బహూకరణ



పుస్తకాలను అందజేస్తున్న సుబ్బారావు

కొత్తపేట: ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు, కొత్తపేట కళాసాహితి ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు తన గ్రంథ సంపదను వివిధ గ్రంథాలయాలకు బహూకరించారు. కొత్తపేటకు చెందిన ఆయన తన సాహితీ జీవితంలో ఎన్నో పుస్తకాలు రచించారు. మరెన్నో పుస్తకాలు సేకరించారు. వాటిలో కవితా సంపుటాలు, వ్యాస సంకలనాలు, అభ్యుదయ రచనలు, అంబేడ్కర్ ఆలోచన, విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు, గద్య, పద్య రచనల వంటివి సుమారు 3 వేల పుస్తకాలు ఉన్నాయి. వాటిని వివిధ గ్రంథాలయాలకు అందించాలని కోరుతూ రాజోలు దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణకు శనివారం అందజేశారు. విలువైన, విజ్ఞానదాయకమైన ఈ పుస్తకాలు తన తదనంతరం శిథిలమై ఎవరికీ కాకుండా పోకూడదని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఇలా అందించానని సుబ్బారావు చెప్పారు. తన సాహితీ జీవితానికి, ఈ పుస్తకాల సంరక్షణలో తన భార్య సుశీల సహకారం ఎంతో ఉందని అన్నారు. వేదిక తరఫున సుబ్బారావు, సుశీల దంపతులను మురళీకృష్ణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాసమితి సభ్యుడు, ప్రియదర్శినీ బాలవిహార్ కరస్పాండెంట్ ఏబీసీ దేవ్, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్, దళిత చైతన్య వేదిక కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాలు



జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాలకు విచ్చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి

కొవ్వూరు: కంచి కామకోటి పీఠం 69వ అధిపతి జయేంద్ర సరస్వతి స్వామివారి ఆరాధనోత్సవాలు స్థానిక గోష్పాద క్షేత్రం కళావేదికలో శనివారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుత పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పావన గోదావరి నదిలో స్నానమాచరించి క్షేత్రంలోని శంకరాచార్య స్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠంలో నిర్వహిస్తున్న చతుర్వేద యాగం పూజా కార్యక్రమాల్లోనూ విజయేంద్ర సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి.. భక్తజన గోదారి



వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి భక్తజన గోదారిని తలపించింది. ఇక్కడి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. వివిధ సేవలు, ప్రసాద విక్రయాలు, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.15,18,300 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెరవలి: అతి వేగం ఒకరి ప్రాణాన్ని బలిగొంది. పెరవలి ఎస్సై ఎం.సూర్య భగవాన్ కథనం ప్రకారం.. మండలంలోని కాకరపర్రుకు చెందిన బొక్క వాసుదేవ్ (20), పంపన శ్రీరాములు శుక్రవారం అర్ధరాత్రి బైక్‌పై పెరవలి వస్తున్నారు. ఈ క్రమంలో పెరవలి వద్ద ఆగి ఉన్న లారీని వారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయలైన వాసుదేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెరవలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె వాకిట తెలుగు దీపం

- భాషా సాహిత్య సేవల్లో పునీతం
- ఖ్యాతికెక్కిన ఆంధ్రి కుటీరం
- నేడు మధునాపంతుల జయంతి



మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి


కాజులూరు: తెలుగు జాతి మనుగడకు సాహిత్యమే ములాధారమని నమ్మి ఎందరో కవులు, రచయితలు సాహిత్య సేవ చేశారు.. చేస్తున్నారు. అటువంటి వారిలో అగ్రగణ్యులు కాజులూరు మండలం పల్లిపాలేనికి చెందిన మధునాపంతుల కుటుంబీకులు. సుమారు ఎనిమిది దశాబ్దాల క్రితం గ్రామంలో 'ఆంధ్రీ కుటీరం' పేరుతో ఒక సంస్థను స్థాపించి.. సమాజంలోని నిమ్నవర్గాల్లో విద్యా సుగంధాలు వెదజల్లారు. ఇప్పటికీ గ్రామంలోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందిస్తున్నారు. సమాజానికి తమ వంతు భాషా సేవ చేయాలనే లక్ష్యంతో 1939లో 'ఆంధ్రి' పేరుతో సాహిత్య మాసపత్రికను స్థాపించి.. దాని ద్వారా పలువురు కవుల సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. నేటికీ ఎందరో కవులు, రచయితలను సత్కరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఆంధ్రీ కుటీరం, ఆంధ్రీ పత్రిక వ్యవస్థాపకుడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 103వ జయంతి మహోత్సవాలను ఆదివారం పల్లిపాలెంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఆ మహాకవి జీవిత విశేషాలివీ..

'ఆంధ్రీ' ఆవిర్భావం

గోదావరి తీరాన కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం సమీపంలోని ఓ చిన్న గ్రామం పల్లిపాలెం. చుట్టూ ఆకుపచ్చని తివాచీ పరచినట్టు పంట చేలు, మట్టి రోడ్డు పొడవునా మామిడి తోపులు, మొగలిపొదల పరిమళాలు.. నాగరిక వాసనలకు దూరంగా రమణీయంగా శోభించే ఆ పల్లె వాకిట్లో వెలసిన ఆ తులసికోట పేరే ఆంధ్రీ కుటీరం. సంప్రదాయ ప్రమిదలో సంస్కృతి చమురు పోసి, సాహిత్యపు ఒత్తి వేసి.. నాడు అక్కడ వెలిగించిన దీపం వజ్రోత్సవ కళతో నేటికీ చిరంతనంగా వెలుగులు విరజిమ్ముతూనే ఉంది. ఆ కుటీరం వెనుకన రసాల వృక్ష ఛాయలో కాళిదాస శాకుంతలంలోని శ్లోకాలు.. ద్రాక్ష తీగల పందిరి కింద కవిత్రయ భారతం, నందివర్ధనం చెట్టు నీడన నంది తిమ్మన పారిజాతాపహరణంలోని మధురమైన పద్యాలు ఏ భైరవిలోనో, కళ్యాణిలోనో వినిపించేవి. అక్కడకు వెళ్లి చూస్తే కడప రాతి పలకల మీద కూర్చుని బ్రహ్మవర్చస్సుతో కావ్య ప్రవచనం చేసి ఓ శ్రోత్రియ యువకవి కనిపించేవారు. ఆ సాహితీ తేజోమూర్తే అనంతర కాలంలో ఆంధ్ర పురాణాది కావ్యాలను విరచించిన కళాప్రపూర్ణుడు, ఆంధ్ర కల్హణుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి. 1920 మార్చి 5వ తేదీన ఐ.పోలవరం గ్రామంలోని మాతామహుడు ఆకొండి రామ్మూర్తి శాస్త్రి ఇంట ఆయన జన్మించారు. తల్లిదండ్రులు లచ్చమ్మ, సత్యనారాయణమూర్తి. పల్లిపాలెం, ఇంజరం, విజయనగరాల్లో ఆయన విద్యాభ్యాసం జరిగింది. చిన్నతనం నుంచే మధునాపంతుల వారు కావ్య వ్యాకరణాలు ఔపోసన పట్టారు. తాను నేర్చిన సాహిత్య జ్ఞాన సంపదను గ్రామ సీమల్లోని జిజ్ఞాసువులకు పంచాలనే ఏకైక లక్ష్యంతో 1938 జనవరి 13న 'ఆంధ్రీ కుటీరం' అనే సంస్థను ఆయన స్థాపించారు. హరిజనులకు సైతం ప్రాచీన కావ్య సంపద, తెలుగు, సంస్కృత భాషలను బోధించాలనే అభ్యుదయ భావంతో.. వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించి తమ కుటీరంలో చదువు నేర్పారు. అనంతర కాలంలో వారిలో చాలామంది ఉపాధ్యాయులుగా, పలు ఉద్యోగాల్లో స్థిరపడి మంచి పేరు గడించుకున్నారు.



పల్లిపాలెంలోని ఆంధ్రీ కుటీరం



ఆంధ్రీ కుటీరం వద్ద మధునాపంతుల ఆంధ్ర పురాణం రచించిన ప్రాంతం



మధునాపంతుల కుటుంబీకులు నిర్వహిస్తున్న ఉచిత పాఠశాల



1939 నాటి ఆంధ్రి పత్రిక తొలి సంచిక

ఆంధ్రి పత్రిక ఆరంభమైందిలా..

సమాజానికి తనవంతు భాషా సేవ చేయాలనే తలంపుతో సాహిత్య మాస పత్రికను ప్రారంభించాలన్నది శాస్త్రిగారి లక్ష్యం. ఎలాంటి సదుపాయాలూ లేవు. కనీసం పోస్టు అందుకోవాలన్నా రెండు కిలోమీటర్లు వెళ్లాలి. కరెంటు వంటి సౌకర్యాల ఊసే లేదు. కానీ పత్రిక రావాలి. ఇదీ ఆయన ప్రబల ఆకాంక్ష. 1929 మార్చి 22– ప్రమాది ఉగాదిన ఆంధ్రీ కుటీర తొలి వార్షికోత్సవం జరిగింది. అదే రోజు వేదుల రామమూర్తి అధ్యక్షతన ఆంధ్రి పత్రిక ఆవిర్భవించింది. దేశంలోని ప్రసిద్ధ కవి పండితులు తమ రచనలతో ఈ పత్రికను ఆశీర్వదించారు. ఎందరో సాహితీమూర్తులు కవితలు, వ్యాసాలు పంపేవారు. ఉద్యోగ రీత్యా శాస్త్రిగారు 1947లో రాజమండ్రి వెళ్లాల్సి వచ్చింది. అనంతరం కుటీర బాధ్యతలను ఆయన సోదరుడు మధునాపంతుల సూరయ్యశాస్త్రి స్వీకరించారు. అన్నగారి బాటలోనే స్థానిక మిత్రుల సహకారంతో ఆంధ్రీ కుటీరాన్ని కొనసాగించారు. వేసవి సెలవులు, ఇతర సందర్భాల్లో కుటీరానికి మధునాపంతుల వచ్చేవారు.

వర్తమానం

ఆంధ్రీ కుటీరం 1980వ దశకంలో కొత్త కొమ్మలు, రెమ్మలతో విరబూసింది. నవతరం నిర్వహణలోకి వచ్చింది. అటు సంప్రదాయ పథం – ఇటు నవీన పంథా ఆంధ్రీకి నవ్యోత్సాహన్నిచ్చాయి. సూరయ్య శాస్త్రి పర్యవేక్షణలో వారి తనయుడు సత్యనారాయణమూర్తి నిర్వహణ బాధ్యతలు స్వీకరించారు. కోలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పని చేస్తూ, అనువంశిక ఆయుర్వేద వైద్యం నిర్వహిస్తూ కుటీరాన్ని, సాహిత్య సేవను కొనసాగిస్తున్నారు. 2011లో 'మధుశ్రీలు' పుస్తకావిష్కరణ సందర్భంగా పల్లిపాలెంలో అద్దేపల్లి రామమోహనరావు అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధ కవులందరూ హాజరయ్యారు. నేటికీ ఏటా మధునాపంతుల జయంతి సభలను ఆంధ్రీ కుటీరం నిర్వహిస్తోంది.

గంజాయి అమ్ముతున్న ఆరుగురి అరెస్టు



జొన్నాడలో గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టు చేసిన నిందితులతో రావులపాలెం పోలీసులు

ఆలమూరు/రావులపాలెం: అక్రమ మార్గాల్లో సంపాదించేందుకు వివిధ గ్రామాల్లో గంజాయిని అమ్ముతున్న ఆరుగురిని ఆలమూరు, రావులపాలెం పోలీసులు వేర్వేరుగా అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు యువకులను ఆలమూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. జొన్నాడ శివారున గంజాయి నిల్వ ఉంచారనే సమాచారంతో కొత్తపేట డీఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ముగ్గురు యువకులను అరెస్టు చేసి, 21 కేజీల గంజాయిని తహసీల్దార్ ఐపీ శెట్టి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఈ యువకులు దుర్వ్యసనాలకు బానిసలై, అక్రమ సంపాదన కోసం ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి మండలంలో విక్రయిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఎస్సై శివప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రావులపాలెంలో..

రావులపాలేనికి చెందిన గోలి రిషికా అలియాస్ భవాని, విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తోందని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. దీనిని రావులపాలెం కాలువ అవతల నివసిస్తున్న మల్లిడి సందీప్‌రెడ్డి, కొత్త కాలనీకి చెందిన తాడిశెట్టి కిషోర్‌లు ఆమెతో కలిసి స్థానిక యువకులకు విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. మండలంలోని పూరేటివారి చెరువు శివారున దాచి ఉంచిన రూ.63 వేల విలువ చేసే 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురినీ అరెస్టు చేసి కొత్తపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు.

తెలుగు భాషపై మమకారంతో..

- పరిశోధనలు చేస్తున్న ఫ్రాన్స్ వాసి డాక్టర్ డానియెల్ నేజర్స్
- కొన్నేళ్లుగా మన జానపద కళారూపాలపై అధ్యయనం
- తెలుగు – ఫ్రెంచి నిఘంటువుకు రూపకల్పన



పరిశోధకుడు డాక్టర్ డానియేల్ నేజర్స్

యానాం: విదేశీయుడే అయినప్పటికీ ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవను ఎవ్వరూ మరచిపోలేరు. సరిగ్గా ఇదేవిధంగా మన భాషా సంస్కృతుల వ్యాప్తికి ఫ్రాన్స్ దేశానికి చెందిన డాక్టర్ డానియెల్ నేజర్స్ అవిరళ కృషి చేస్తున్నారు. ప్యారిస్‌లోని ఫ్రెంచి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజెస్ అండ్ సివిలైజేషన్ సంస్థలో భాగమైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సౌత్ ఏషియా హిమాలయన్ స్టడీస్‌లో ఆయన ప్రొఫెసర్. ఆ విద్యా సంస్థలో 102 భాషలు, ఆయా నాగరికతలు, సంస్కృతులను వివరించడంతో పాటు అధ్యయనం కూడా చేస్తున్నారు. విదేశీయుడే అయినప్పటికీ ఆయన తెలుగు అనర్గళంగా మాట్లాడతారు. అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర వంటి వాటిని ఫ్రెంచిలోకి అనువదించారు. సత్యహరిశ్చంద్ర, చింతామణి, కాళ్లకూరి నారాయణరావు 1920లో రాసిన నాటకాల గురించి నేజర్స్ అలవోకగా వివరిస్తారు. పల్లిపాలెంలోని ఆంధ్రీ కుటీరంలో ఆదివారం జరిగే మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి జయంత్యుత్సవానికి ఆహ్వానితుడిగా ఆయన వచ్చారు. ఈ సందర్భంగా శనివారం తనను కలిసిన 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. తెలుగు భాష నేర్చుకోవాలన్న తపనే నేజర్స్‌ను భారత దేశానికి రప్పించింది. తెలుగు నేర్చుకోవడానికి ముందు ఆంధ్రప్రదేశ్‌లోని జానపద కళారూపాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం 1983లో భార్య హెరాన్ స్మిత్‌తో కలిసి పెద్దాపురం చేరుకున్నారు. మిరియాల జయరామయ్య, దేవాదుల బ్రహ్మానందం వద్ద శిష్యరికం చేస్తూ 12 బుర్రకథలపై అధ్యయనం చేశారు. బొబ్బిలి యుద్ధం, జంగం కథ, భట్రాజుకథ, దాట్ల దేవదానంరాజు యానాం కథలతో పాటు హరికథలు, తోలుబొమ్మలాటలు, కంజరి కథ, యానాం కథల వంటి వాటి గురించి తెలుసుకుని, వాటిని ఫ్రెంచి భాషలోకి అనువదించానని నేజర్స్ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ శాఖాధిపతి అబ్బూరి గోపాలకృష్ణ, ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, తెలుగు శాఖ అధిపతి ప్రొఫెసర్ మలయవాసిని నేతృత్వంలో పరిశోధలు చేశారు. జానపద కళారూపాలపై మాధవపట్నం, తుని సమీపంలోని పెంటకోట ప్రాంతాల్లో అధ్యయనం చేశారు. 2011లో తాళ్లరేవు మండలం నీలపల్లిలోని సాలగ్రామ జగన్నాథ రాధాకృష్ణ వద్ద తెలుగు వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు – ఫ్రెంచి నిఘంటువు తయారు చేయాల్సిందిగా డాక్టర్ నేజర్స్‌కు 2002లో తెలుగు అకాడమీ డైరెక్టర్ ఆవుల మంజులత సూచించారు. ఈ మేరకు 1,600 పేజీల నిఘంటువు తయారు చేశారు. మిగిలింది మూడేళ్లలో పూర్తవుతుందని నేజర్స్ చెప్పారు.

భావనలు, అనువాదాలు వేర్వేరుగా ఉంటాయని, సరైన అర్థం వచ్చేలా నిఘంటువుకు రూపుదిద్దుతున్నానని తెలిపారు. యూరప్‌లో బోధన మాతృభాషల్లోనే సాగుతుందన్నారు. తాను మాతృభాష ఫ్రెంచి తర్వాత ఇంగ్లిషు నేర్చుకున్నానన్నారు. భారత దేశంలో ఉన్న భాషలే భారతీయ నాగరికత అని, వైవిధ్యమైన సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యంలో భాషలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని నేజర్స్ సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలు ఎక్కడ జరిగినా తాను హాజరవుతానని చెప్పారు. ఇటీవల మారిషస్‌లో తెలుగు వారి ఆహ్వానం మేరకు వెళ్లానని తెలిపారు.